సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు.

- 8లో ▸



మా సమస్యలు పట్టవా..?

అందరు ఉద్యోగుల్లాగే తమనూ పట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు కలెక్టరేట్‌ను ముట్టడించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /24.9

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చదువుతోనే గుర్తింపు



బాన్సువాడ : చదువుకుంటేనే నేడు సమాజంలో గుర్తింపు లభిస్తుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రూ. 25 లక్షల నిధులతో రహమానియ మోడల్ ఉర్దూ మీడియం పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు భవిష్యత్‌కు పునాదులు విద్యార్థులేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సహకార సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఆర్డీవో భుజంగరావు, మాజీ ఎంపీపీ ఎజాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, వార్డు కౌన్సిలర్ నేహా సుల్తానా, నాయకులు అలిమోద్దీన్‌బాబా, షాదీఖానా చైర్మన్ వాహబ్, విఠల్‌రెడ్డి, రహీం, హకీం, ఇలియాస్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కామారెడ్డి అర్బన్ : మహిళలు తమ స్వయం ఉపాధి శిక్షణను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత అన్నారు. గురువారం కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి అక్షయ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉచిత టైలరింగ్, అడ్వాన్స్ బ్యూటీషియన్ 45 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలకు ఆకుల లలిత సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఆర్మూర్ పెర్కిట్‌లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ద్వారా అన్ని రంగాల్లో శిక్షణనిస్తున్నామన్నారు. కామారెడ్డి లోని అక్షర సంస్థ కంప్యూటర్ కోర్సులు, మ గ్గం వర్క్ శిక్షణను ఇతర మహిళలకు తెలిపి సహకరించాలన్నారు. సమావేశంలో పెర్కిట్ మేనేజర్ పద్మ, అక్షయ సంస్థ డైరెక్టర్ శీలం భూపాల్, ప్రతినిధులు శ్రీలత, స్వరూప, రమ్యశ్రీ, కౌన్సిలర్ కాసర్ల గోదావరి, లలిత పాల్గొన్నారు.

రేపు సివిల్ సర్వీసెస్ క్రీడల జిల్లాస్థాయి ఎంపికలు

కామారెడ్డి అర్బన్ : ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడాపోటీలకు సంబంధించి ఈనెల 18, 19, 20, 21 తేదిల్లో హైదరాబాద్‌లోని వివిధ స్టేడియాల్లో ఎంపికలుంటాయని జిల్లా యువజన, క్రీడా అధికారి వై దామోదర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీసెస్ క్రీడాల్లో పాల్గొనాలనే ఆసక్తిగల జిల్లా ఉద్యోగులకు ఈనెల 12న కామారెడ్డి ఇందిరాగాంధీ స్టేడియంలో స్థాయి ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా యువజన,క్రీడా అధికారి పేర్కొన్నారు. సివిల్ సర్వీస్ ఉద్యోగులు కలెక్టరేట్‌లోని 223 రూంలో పేర్ల నమోదు చేసుకోవాలని సూచించారు.

సర్వేల మీద సర్వేలు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా నియోజక వర్గాల్లో ప్రధాన పార్టీలు, పోటీకి రెడీ అవుతున్న నేతల బలాబలాలపై సర్వేలు జరుగుతున్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో మూడోసారి అధికారం చేజిక్కించుకుని హ్యాట్రిక్ కొట్టేందుకు ఈ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుంటోంది. ఇప్పటికే పలు దఫాలుగా సర్వేలు నిర్వహించింది.

- ఊళ్లను చుట్టేస్తున్న బృందాలు
- సీఎం పోటీ చేస్తే ఎలా ఉంటుందని ముఖ్యమైన ప్రాంతాల్లో ఆరా..!
- ప్రధాన పార్టీల బలాబలాలు ఎంత..?
- ప్రజల నాడి పట్టేందుకు ప్రయత్నాలు



సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ పనితీరు, సిట్టింగు ఎమ్మెల్యేలకు సంబంధించి ప్రజల నాడిని తెలుసుకునేందుకు వివిధ వర్గాల ద్వారా బీఆర్ఎస్ ఆరా తీసింది. జిల్లాలో కీలకమైన కామారెడ్డి నియోజక వర్గంపై అధికార పార్టీ ఎక్కువగా ఫోకస్ చేస్తోంది. సీఎం కేసీఆర్ కామారెడ్డి నియోజక వర్గంలో పోటీ చేస్తాడన్న ప్రచారానికి బలం చేకూర్చేలా సర్వే బృందాలు సీఎం పోటీ చేస్తే ఎలా ఉంటుందని ఆరా తీస్తున్నాయి. కామారెడ్డిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం, స్థానికంగా మెడికల్ కాలేజీ మంజూరు చేయడం, ఎన్నో ఏళ్లుగా పెండింగులో ఉన్న రామారెడ్డి, బీబీపేట, రాజంపేట మండలాల ఏర్పాటు వంటి అంశాలు అధికార పార్టీకి అనుకూలించేవి. ఇవన్నీ ప్రజల్లో ఏమేరకు పాజిటివ్‌ను పెంచిందన్న అంశాన్ని ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది. రూ.లక్ష లోపు రుణమాఫీ చేపట్టడం ద్వారా రైతులు ఏమంటున్నారని కూడా ఆరా తీస్తున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సర్వే బృందాలు విస్తృతంగా తిరుగుతూ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నాయి. ఇదే సమయంలో ఇతర పార్టీల ప్రభావం, పోటీలో ఉండే అభ్యర్థులకు ప్రజల్లో ఏ మేరకు మద్దతు ఉందన్నదానిపైనా ప్రజల నుంచి సేకరిస్తున్నారు. అలాగే ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజక వర్గాల్లో కూడా సర్వేలు కొనసాగుతున్నాయి. సిట్టింగు ఎమ్మెల్యేల పనితీరు, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు ఎంతమేరకు సంతృప్తిగా ఉన్నారని అడుగుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి ఎవరు నిలబడతారు? వారికి ఉన్న బలమెంత? అన్న విషయాలపై ఆరా తీస్తున్నారు.

నలుగురు జమయ్యే చోట..

ఎన్నికల సర్వేల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నలుగురు జనం గుమిగూడే చోటకు వెళ్లి ఎన్నికల గురించి కల్పించుకుంటూ, ప్రభుత్వ పథకాలు ఏమేరకు అందాయి, స్థానికంగా జరిగిన అభివృద్ధి, ఎమ్మెల్యేల పనితీరు, ఇతర పార్టీ ల్లో పోటీకి రెడీ అయిన నాయకుల బలాబలాల గురించి అడుగుతున్నారు. హోటళ్లు, కల్లు దుకాణాలు, కూడళ్లు, కొన్ని చోట్ల బీడీ కార్ఖానాల దగ్గరకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సర్వే బృందాలు దాదాపు అన్ని గ్రామాలను చుట్టేస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు అందుకున్న వారిని కూడా కలుస్తున్నారు. పథకాలతో వారికి కలిగిన మేలు, మధ్యవర్తులు ఎవరైనా డబ్బులు తీసుకున్నారా అని కూడా అడుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే పట్టణాల్లో కూడా సర్వేలు నిర్వహిస్తున్నారు. మార్కెట్‌ల వద్ద, దుకాణాలు, హోటళ్లు, బస్టాండ్ వద్ద, కాలేజీల వద్దకు వెళ్లి జనం నాడిని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

కేసీఆర్ గురించి ప్రస్తావన..

ఇటీవల నిర్వహిస్తున్న సర్వేలో వివిధ అంశాలపై వి వరాలు సేకరించి ఆఖరులో కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం పోటీ చేస్తే ఎలా ఉంటుందన్నదాని గురించి అడుగుతున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్‌ను పోటీ చేయాలని తాను మూడుసార్లు కలిసి కోరినట్లు స్థానిక ఎమ్మెల్యే, ప్ర భుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్న నేపథ్యంలో స ర్వేలో కూడా కేసీఆర్ పేరు ప్రస్తావిస్తుండడం హాట్‌టాపిక్‌గా మారింది. సీఎం పోటీ చేస్తారా లేదా అన్నదానిపై క్లారిటీ లేనప్పటికీ రాష్ట్రంలో మూడో సారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. అందులో బాగంగా సీఎం పోటీ అంశాన్ని తెరపైకి తీసుకవచ్చిందని భావిస్తున్నారు. ప్రజల నాడిని పట్టుకునేందుకు చే స్తున్న సర్వేల గురించి అంతటా చర్చ జరుగుతోంది.

ఈసారి కూడా చిత్తుగా ఓడిస్తా..

- నీ అబద్ధపు ప్రచారాలను జనం నమ్మరు
- రామారెడ్డి, రాజంపేట, బీబీపేట మండలాలు ఏర్పాటు చేసింది నేనే..
- రూ. వందల కోట్లతో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదా..?
- షబ్బీర్‌అలీపై గంప ధ్వజం



సాక్షి, కామారెడ్డి : 'నా చేతిలో ఇన్నిసార్లు ఓడినా నీకు బుద్ధిరాలేదు. అబద్దాలు ప్రచారం చేస్తూ జనాన్ని మోసం చేయాలని అనుకుంటున్నావు. నిన్ను జనం నమ్మరు.. రూ. వందల కోట్లతో అభివృద్ధి చేస్తే నీకు కనబడదు. జిల్లా ఏర్పాటు నుంచి మండలాల ఏర్పాటు దాకా అన్నీ నా హయాంలోనే జరిగాయి. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకో. ఈసారి కూడా నిన్ను చిత్తుగా ఓడిస్తా ' అంటూ మాజీ మంత్రి షబ్బీర్ అలీపై ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఒంటికాలి మీద లేచారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో అభివృద్ధి జరగలేదంటూ షబ్బీర్‌అలీ ఊళ్లు తిరుగుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. 2018 ఎన్నికల సమయంలో ఆస్తులను ప్రజలకు పంచుదామని తాను గాంధీ విగ్రహం వద్దకు వెళ్తే తాను వేచి చూసి వెళ్లిన తర్వాత వచ్చి ప్రగల్భాలు పలికాడన్నారు. టేక్రియాల్ దగ్గర డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఆరోపణ చేసి, సమయం చెప్పకుండా వెళ్లి తాను రాలేదంటూ తప్పుడు ప్రచారం చేశాడన్నారు. అభివృద్ధి జరగలేదంటూ మాట్లాడుతున్న షబ్బీర్‌అలీని ఏ గ్రామంలో జరగలేదో చర్చకు వస్తే చూయిస్తానని తాను సవాల్ చేశానని, ఆరోపణ చేసిన వ్యక్తి స్థలం, సమయం చెప్పకుండా మళ్లీ ఏవేవో మాట్లాడుతున్నాడన్నారు. టేక్రియాల్ నుంచి నర్సన్నపల్లి దాకా ఆరు వరుసల రోడ్డు వేసి డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వేయించానని, బేసిక్ నుంచి తు జాల్‌పూర్ దాకా డబుల్ రోడ్డు, ఇందిరా చౌక్ నుంచి బైపాస్ దాకా నాలుగు వరుసల రోడ్డు చేసినది కనిపించడం లేదా అని నిలదీశారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవీవిహార్ వరకు 4 వరుసల రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వేయిందించి తానేనన్నారు. షబ్బీర్ సొంత మండలం మాచారెడ్డిలో తాను మంజూరు చేసిన నిధులతో 4 లైన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. కామారెడ్డిని జిల్లా కేంద్రం చేసి కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, కళాభారతిలను చూస్తే అభివృద్ధి కనిపిస్తుందన్నారు. దశాబ్దాలుగా రామారెడ్డి, బీబీపేట, రాజంపేట మండలాల ఏర్పాటు కావాలని కోరితే నీవు మంత్రిగా ఉండి ఎందుకు చేయలేదని, తాను ఆ మూడు మండలాలను ఏర్పాటు చేయించానన్నారు. నా చేతిలో ఓడిపోవడమే నీ చరిత్ర అని పేర్కొన్నారు. నాది పారిపోయే నైజం కాదని, కామారెడ్డి నియోజక వర్గంలో ఓడిపోయే చరిత్ర కూడా లేదన్నారు.

పట్టణంలో కుక్కల నియంత్రణకు కృషి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



కామారెడ్డి క్రైం : వీధి కుక్కల జనాభాను తగ్గించడానికి కామారెడ్డి పట్టణంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను త్వరలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జంతు హింస నివారణ సంఘం సభ్యులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వీధి కుక్కలను చంపడం, వేధించడం, హింసించడం చేయకూడదన్నారు. చనిపోయిన జంతువుల కళేబరాలను మున్సిపల్ సిబ్బంది, పంచాయతీ అధికారులు తక్షణమే తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ జంతు హింస నివారణ చట్టం నిబంధనలు పాటించాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు వీధి కుక్కల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ కేఎస్ రెడ్డి, ఆర్డీవో వాణి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సింహారావు, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, ఎఫ్ఆర్‌వో రమేష్, వాణిజ్య పన్నులశాఖ అధికారి రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

జుక్కల్ రోడ్లకు మహర్దశ

- రూ. 22 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే హన్మంత్ సింధే



సాక్షి, కామారెడ్డి : నియోజకవర్గంలో బీటీ రోడ్డు లేని మిగితా గ్రామాలన్నింటికీ బీటీ రోడ్లు వేయించేందుకు సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించగా స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధుల నుంచి రూ. 22 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే సింధే పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటనలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి గురించి వివరించారు. మద్నూర్ మండలంలో లింబూర్ నుంచి వాడి రోడ్డుకు రూ. 3 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి సో మూర్ రోడ్డుకు రూ. 60 లక్షలు, జాతీయ రహదారి నుంచి కందార్‌పల్లి మీదుగా రాచూర్ వరకు బీటీ రోడ్డుకు రూ. 2.70 కోట్లు, జెడ్పీ రోడ్డు మదన్‌హిప్ప ర్గ నుంచి ఇలేగావ్ రోడ్డుకు రూ. కోటి 80 లక్షలు మంజూరు చేశామన్నారు. పిట్లం మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పోతిరెడ్డిపల్లి రోడ్డుకు రూ. 90 లక్షలు, నిజాంసాగర్ మండలంలో జాతీయ రహదారి నుంచి అచ్చంపేట మీదుగా లింగంపల్లి వరకు రోడ్డుకు రూ. 4 కోట్లు, ఆరేడ్ జెడ్పీ రోడ్డు నుంచి మర్పల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 2.70 కోట్లు, బిచ్కుంద పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి మెక్క వరకు రోడ్డుకు రూ. కోటి 50 లక్షలు, పెద్ద కొడప్‌గల్‌లోని జెడ్పీ రోడ్డు నుంచి పోచారం గ్రామంకు రోడ్డు కోసం రూ. 80 లక్షలు, బాబుల్‌గావ్ జెడ్పీ,చింతల్‌వాడీ రోడ్డుకు రూ.2 కోట్లు, సిద్దాపూర్, మైభాపూర్ రోడ్డుకు రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.

గ్రామస్తులపై పోలీసుల లాఠీచార్జీ

- లింగంపేటలోని ఎక్కపల్లి శివారులో ఫారెస్ట్ భూములను దున్నిన గ్రామస్తులు
- నిలువరించిన పోలీసులు
- పలువురిని అరెస్ట్ చేసి ఎల్లారెడ్డి పీఎస్‌కు తరలింపు





ఎక్కపల్లి అటవీ ప్రాంతంలో మోహరించిన పోలీసులు, ఎల్లమ్మ ఆలయం వద్ద కూర్చున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : లింగంపేట మండలంలోని ఎక్కపల్లి గ్రామంలో గ్రామస్తులపై పోలీసులు గురువారం రాత్రి లాఠీచార్జీ చేశారు. తమ గ్రామంలో గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాలుగు రోజుల క్రితం అటవీ భూములను సాగుచేసేందుకు ప్రయత్నించారు. దీనిని అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో వివాదం రాజుకుంది. ఈ విషయమై గురువారం సాయంత్రం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్, లింగంపేట తహసీల్దార్ చంద్ర రాజేశ్వర్, నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి ఎస్సైలు, సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలతో ఎక్కపల్లి గ్రామానికి చేరుకున్నారు. గ్రామ శివారులో గ్రామస్తులు దున్నిన అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు.అనంతరం గ్రామస్తులంతా స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద సమావేశమయ్యారని తెలుసుకుని అక్కడికి వెళ్లి మాట్లాడారు. అటవీభూములు కబ్జా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గిరిజనులకు మాత్రమే ప్రభుత్వం పోడు పట్టాలను అందిస్తోందని, బీసీలకు ఇవ్వట్లేదని బీసీలు అటవీభూములు దున్నితే చట్టరీత్యా నేరమన్నారు. గ్రామంలో 144 సెక్షన్ విధించారు. సాయంత్రమైనా గ్రామస్తులు ఎల్లమ్మ ఆలయం వద్ద నుంచి గ్రామస్తులు ఇళ్లకు వెళ్లలేదు. పోలీసులు హెచ్చరించినప్పటికీ కదల్లేదు.

ఈ సమయంలోనే వి ద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పోలీసులు గ్రామస్తులు లాఠీచార్జీ చేసి గ్రామస్తులను చెదరగొట్టారు. అనంతరం పలువురిని ఎల్లారెడ్డి పీఎస్‌కు తరలించా రు. అయితే గ్రామస్తులు మాట్లాడుతూ 2005 కంటే ముందు అటవీ భూముల్లో సాగులో ఉన్న వారికి ప ట్టాలివ్వాల్సి ఉంటుందని, 2016లో ఎక్కపల్లి శివారులోని 691 కంపార్ట్‌మెంట్‌లో ప్లాంటేషన్ చేశారని, అందులోనే ప్రస్తుతం గిరిజనులకు పోడు పట్టాలు ఎలా ఇస్తారని వారు పేర్కొంటున్నారు. తమకు ప ట్టాలివ్వకున్నా సాగు చేస్తామని, తమ గ్రామంలో ని రుపేదలు అనేకమంది ఉన్నారని, వారికే భూములు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణది త్యాగాల చరిత్ర

- 'కామారెడ్డి సమగ్ర స్వరూపం' పుస్తకావిష్కరణలో కలెక్టర్



జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు

కామారెడ్డి అర్బన్ : తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఎంతో గొప్పదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు, కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 'కామారెడ్డి జిల్లా సమగ్ర స్వరూపం' నటేశ్వర శతకం పుస్తకావిష్కరణ సభ గురువారం పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం కళాశాల బాల్‌రాజ్‌గౌడ్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలు, సమ్మక్క సారలమ్మ, జంపన్న, కాకతీయుల నుంచి నిజామాబాద్ ఖిల్లా గోడలపై నా తెలంగాణ కోటి రతనాల వీణ రాసిన దాశరథి కృష్ణమాచార్య, గద్దర్, గోరేటి వెంకన్న వరకు ఎందరో మహానుభావులు చరిత్రలో నిలిచిపోతారన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల కోసం 600 పుస్తకాలు కొనుగోలు చేస్తామని కలెక్టర్ అన్నారు. సభాధ్యక్షత వహించిన తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ 1943 నుంచి నేటి వరకు 80 ఏళ్లుగా సారస్వత పరిషత్తు సాహితీ సేవలు అందిస్తుందన్నారు. దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి నుంచి నేటి ఎల్లూరి శివారెడ్డి వరకు 80 ఏళ్లుగా సాహితీ సేవలు అందిస్తున్నారన్నారు. పుస్తకానికి రూపు తేవడంలో కామారెడ్డి కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ వి శంకర్ చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్, పరిషత్తు ప్రధాన కార్యదర్శి జుర్రు చెన్నయ్య, ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య, వి శంకర్ తదితరులున్నారు.

క్లుప్తంగా

తెలుగులో నర్సింహస్వామికి డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖ పరిశోధక విద్యార్థి ఎం నర్సింహస్వామి డాక్టరేట్ సాధించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఆచార్య గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో 'డా. వెలిచాల కొండలరావు జీవితం – వా/్మయ సేవ' అనే అంశంపై నర్సింహస్వామి పరిశోధన చేశారు. గురువారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మినీ సెమినార్ హాల్‌లో వైవా నిర్వహించి పీహెచ్‌డీ అందజేశారు. వైవాకు బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ రజని ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. ఆర్ట్స్ డీన్ కనకయ్య, బీవోఎస్ చైర్మన్ త్రివేణి, విభాగాధిపతి కె లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణచక్రవర్తి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని వినతి



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్, బాసర ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణను గురువారం తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు (అకడమిక్ కన్సల్టెంట్లు) కలిశారు. కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజ్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కాంట్రాక్టు అధ్యాపకులు దత్తహరి, గంగకిషన్, నాగేశ్వరరావు, కిరణ్ రాథోడ్, నాగేంద్రబాబు తదితరులున్నారు.

నియామకం



నిజామాబాద్ నాగారం : మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ గా గురువారం నియమితులయ్యారు. హైదరాబాద్‌లో ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్ రెడ్డి తదితరులు రాజేశ్వరరావును అభినందించారు.

సాంఘిక బహిష్కరణ ఎత్తేయాలి



ఆర్మూర్‌టౌన్: కోమన్‌పల్లి గ్రామంలో గొల్లకుర్మ, నాయకపోడ్ కులాలకు చెందిన 52 కుటుంబాలపై వీడీసీ విధించిన సాంఘిక బహిష్కరణను ఎత్తి వేయాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల యాదవ్ డిమాండ్ చేశారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పక్కన గల భూమి పంచానామ విషయంలో సాక్షి సంతకాలు చేసినందుకు బహిష్కరించారన్నారు. గురువారం ఆర్మూర్‌లోని ఏసీపీ కార్యాలయానికి గొల్లకుర్మ, నాయకపోడ్ కుటుంబ సభ్యులు వచ్చి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఎవరు మాట్లాడటం లేదని, పనులకు రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీడీసీపై చర్యలు తీసుకొని గొల్లకుర్మ, నాయకపోడ్ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. అశోక్‌యాదవ్, నిమ్మ పోశెట్టి, దశరథ్ పాల్గొన్నారు.

వీడీసీకి సంబంధం లేదు

కోమన్‌పల్లిలో గొల్లకుర్మ, నాయక్‌పోడ్ కుటుంబాల బహిష్కరణకు వీడీసీకి సంబంధం లేదని వీడీసీ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. వీడీసీ సభ్యులు ఎవరి వద్ద డబ్బులు అడగలేదని, ఎవరికి జరిమానా సైతం వేయ్యలేదన్నారు. ఎవరిని బహిష్కరించలేదని చెప్పారు. వీడీసీ అధ్యక్షుడు రోహిత్ గౌడ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మమ్మల్నీ పట్టించుకోండి

- విద్యాశాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు
- సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి మొర



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు

కామారెడ్డి క్రైం: చేతులెత్తి మొక్కుతున్నాం.. అందరిలాగే మమ్మల్ని కూడా పట్టించుకోండి సార్ అంటూ తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

15 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా శాఖలో తాము కీలకంగా పనిచేస్తున్నామని అన్నారు. గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, చనిపోయిన కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలని, రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జేఏసీ కన్వీనర్ దామోదర చారి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ప్రతినిధులు శ్రీధర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఎవరికొచ్చినా కలిసికట్టుగా పని చేద్దాం

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అరుణతార

ఎల్లారెడ్డి: బీజేపీ ఎమ్మెల్యే టికెట్టు ఎవరికి వచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో బీజేపీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. నాయకులు దేవేందర్, బాలకిషన్, పోచయ్య తదితరులున్నారు.

వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ నాయకులు చిట్యాల సాయన్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతారకు వినతిపత్రం అందించారు. బీజేపీ సహకరించాలని వారు ఆమెకు విన్నవించారు.

బీఆర్ఎస్‌లోకి డీసీఎంఎస్ మాజీ చైర్మన్



బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్

బీబీపేట: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బాయికాడి బాలయ్య కాంగ్రెస్ పార్టీని వీడి గురువారం ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా విప్ గంపగోవర్ధన్ బాలయ్యతో పాటు మరికొంత మందికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌తో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరానని బాలయ్య పేర్కొన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకట్ గౌడ్, ఎంపీపీ బాలమణి పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

పిట్లం(జుక్కల్): పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరం పాల్గొని విజయవంతం చేద్దామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు రూప్ సింగ్ పిలుపునిచ్చారు. ఆయన గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సంఘ సభ్యులు, ఉపాధ్యాయులతో కలిసి సీపీఎస్ ఉద్యోగుల చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

పంటల నష్ట పరిహారం వెంటనే చెల్లించాలి

- భారతీయ కిసాన్ సంఘ్

కామారెడ్డి రూరల్: అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్ట పరిహారం చెల్లించాలని కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. క్రాప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని తీర్మానించారు. లక్ష సభ్యత్వమే లక్ష్యంగా సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు లొంక వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ రావు, కార్యవర్గ సభ్యులు కొమిరెడ్డి అంజన్న, డీసీ సాయిలు, విఠల్ రెడ్డి, సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్



సభ్యత్వం తీసుకుంటున్న కేజీబీవీ టీచర్లు

నిజాంసాగర్(జుక్కల్): కస్తూర్బా గాంధీ టీచర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుషాల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ టీచర్లకు పీఆర్టీయూ సభ్యత్వ నమోదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పీఆర్టీయూ ద్వారానే పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, నాయకులు కలకొండ నారాయణ, వెంకట్రాంరెడ్డి, ప్రిన్సిపాల్ సరోజన తదితరులు ఉన్నారు.

చెట్లను నరికిన వారిపై చట్టరీత్యా చర్యలు



ఎల్లారెడ్డి: అటవీ ప్రాంతంలో అక్రమంగా చెట్లను నరికిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ గోపాల్ రావు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. లింగంపేట మండలంలోని ఎక్కపల్లి శివారు అటవీ ప్రాంతంలో చెట్లను నరికిన వారిపై అటవీ శాఖ చట్టం కింద కేసులు నమోదు చేయడంతో పాటు, పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎఫ్ఆర్‌వో ఓంకార్ తదితరులున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



నిజామాబాద్‌నాగారం: ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి గురువారం నగరంలో చేపట్టిన 5కే రన్‌ను కోర్టు చౌరస్తాలో డీఎంహెచ్‌వో సుదర్శనం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో ఈ 5కే రెడ్ రన్ నిర్వహించామన్నారు. అలాగే క్విజ్ పోటీలు, షార్ట్ ఫిల్మ్, స్కిట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5కే రన్‌లో గెలిచిన వారికి ట్రాఫిక్ సీఐ రాథోడ్ బహుమతులు అందజేశారు. జిల్లా యూత్ కో ఆర్డినేటర్ శైలి బెల్లాల్, వైద్యాధికారులు సంతోష్, ప్రవీణ్, డీపీఎం సుధాకర్, టీబీ, హెచ్ఐవీ కో ఆర్డినేటర్ రవిగౌడ్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేష్, మధుకర్ పాల్గొన్నారు.

పిల్లలతో తల్లి అదృశ్యం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీలకంఠనగర్‌కు చెందిన వివాహిత ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. నీలకంఠనగర్‌కు చెందిన ఉరుసు లక్ష్మి కూతురు రజితకు వర్నికి చెందిన సాయిలుతో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు శ్రీకాంత్(4), అవంతిక(2) ఉన్నారు. సాయిలుతో గొడవ పడి కొన్ని రోజుల క్రితం రజిత తల్లి వద్దకు వచ్చింది. ఈ నెల 4న లక్ష్మి పనికి వెళ్లి వచ్చే సరికి రజిత ఆమె పిల్లలు కనిపించలేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం రాగాపూర్ సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,300, ఐదు సెల్ ఫోన్లు, 2 బైక్‌లలను స్వాధీనం చేసుకున్నట్లు దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

ఉద్యమనేతకు అశ్రునివాళి

- చికిత్స పొందుతూ కాంగ్రెస్ నేత మృతి
- అంత్యక్రియల్లో వందల సంఖ్యలో పాల్గొన్న అభిమానులు



సంగమేశ్వర్(ఫైల్)



30 పడకల ఆస్పత్రి కోసం 2010లో నిరాహార దీక్ష చేస్తున్న సంగమేశ్వర్

పిట్లం(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నేత గంగా సంఘమేశ్వర్ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. సంఘమేశ్వర్ నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన అకాల మరణం పట్ల అఖిలపక్షం నేతలు సంతాపం తెలిపి నివాళులర్పించారు. పిట్లంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. సంఘమేశ్వర్ 2010లో మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మించాలని ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన ఉద్యమ నేతగా వందల మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. పిట్లంలో శిశు మందిర్ పాఠశాల అభివృద్ధి కోసం చాలా కష్టపడ్డారు. సంగమేశ్వర్ మృతితో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆయనకు నివాళులర్పిస్తూ పాఠశాలకు సెలవును ప్రకటించారు. అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే గంగారం, కాంగ్రెస్ నేత గడుగు గంగాధర్‌తో పాటు పలు పార్టీల నేతలు పాల్గొని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే



కాస్లాబాద్‌లో జీపీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్(జుక్కల్): గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. గురువారం కాస్లాబాద్, తలాబ్ తండాలో నూతన జీపీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వరాష్ట్ర పాలనలో తండాలను జీపీలుగా ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలనతో సంక్షేమ, అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. కాంగ్రెస్ పాలనలో జరగని అభివృద్ధి కేవలం 9 సంవత్సరాలలో జరిగిందని అన్నారు. అనంతరం కంగ్టి మండలం నుంచి పెద్దకొడప్ మండలంలో నూతనంగా విలీనమైన బాబుల్ గావు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో రాణి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి, సర్పంచ్ శోభ, ఎంపీటీసీ సాయిబాబ, తదితరులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు సౌకర్యవంతం

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



చేనేత స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: చేనేత వస్త్రాలు సౌకర్యవంతంగా ఉంటాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో చేనేత జౌళి శాఖ, డీఆర్‌డీవోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శరీరానికి ఎంతో చల్లదనాన్ని అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు వారంలో రెండు రోజులు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, డీఆర్‌డీవో సాయన్న, డీపీఎంలు రమేష్ బాబు, రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీఎస్‌డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత, తదితరులు

- టీఎస్‌డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత

మోపాల్: గ్రామాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతల బాగోగులు చూసే అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివని టీఎస్‌డబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ ఆకుల లలిత పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంచిప్ప రైతువేదికలో పోషణ్ అభియాన్‌లో భాగంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తల్లి పాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసాన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు ఆకుల లలిత మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించాలని, ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. రెండేళ్ల వరకు బిడ్డకు తల్లిపాలు తాగించాలని, రోగనిరోధక శక్తి పెరుగుతోందని వివరించారు. పాలివ్వడంతో బిడ్డకు ఎంత ప్రయోజనం చేకూరుతుందో.. తల్లికి అంతే ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. తల్లి పాలతో నవజాత శిశువుల మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని, పిల్లల అభివృద్ధికి దోహదపడుతోందన్నారు. అంతకుముందు పిల్లల వైద్యుడు దీపక్ రాథోడ్ తల్లి పాలతో కలిగే ప్రయోజనాలను ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం అతిథులను డీడబ్ల్యూవో రసూల్ బీ సన్మానించారు. మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, సీడీపీవో సౌందర్య, సర్పంచ్ సిద్ధార్థ, కో ఆప్షన్ మెంబర్ అజీమ్, మెడికల్ ఆఫీసర్ ఆశిష్, వీడీసీ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర పరిశీలకుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా సమస్యలు పరిష్కరించడం లేదని, పీఆర్సీ, హెల్త్‌కార్డులు, 317 జీవోల రద్దు, ఓపీఎస్ విధానం, పారిశుధ్య కార్మికుల నియామకం, ఏకీకృత సర్వీసు నిబంధనలు, బదిలీలు, ప్రమోషన్లు కేజీబీవీ, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేశారు. తపస్ జిల్లా అధ్యక్షుడు పి.రాఘవరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

టాటా ఏస్ బోల్తా



తాడ్వాయి: తాడ్వాయి శివారులో గురువారం తెల్లవారుజామున కూరగాయల లోడ్‌తో వెళ్తున్న టాటా ఎస్ వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. మహారాష్ట్రలోని లాతూర్ నుంచి కూరగాయల లోడ్‌తో వస్తున్న వాహనం తాడ్వాయి దాటిన తర్వాత మూలమలుపు వద్ద బోల్తా పడింది. డ్రైవర్‌కు నిద్రరావడంతో వ్యాన్ రోడ్డు కిందికి పోయి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

గల్ఫ్ ఏజెంట్‌పై చీటింగ్ కేసు

మోపాల్: బోధన్‌కు చెందిన ఎండీ బషీర్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము గురువారం తెలిపారు. బషీర్ డిచ్‌పల్లిలో మస్కట్ ఏజెంట్‌గా చేస్తూ ఆఫీస్ ప్రారంభించాడు. చుట్టుపక్కల గ్రామాల్లో అమాయక ప్రజల నుంచి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేశారు. అలాగే మోపాల్ మండలంలో కూడా సుమారు 15 మంది బాధితులు ఉన్నారు. కంజర్‌కు చెందిన అదరంగి అజేంద్రపాల్ బషీర్‌కు డబ్బులు చెల్లించాడు. డబ్బు తీసుకున్న తర్వాత బషీర్ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి



మగ్గిడి జలంధర్

మోర్తాడ్/బాల్కొండ: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌కు చెందిన హోంగార్డు మగ్గిడి జలంధర్(38) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మరణించాడు. బాల్కొండ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జలంధర్ బుధవారం తన స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా తడపాకల్ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. జలంధర్‌కు భార్య కూతురు, కొడుకు ఉన్నాడు. జలంధర్ రోడ్డు ప్రమాదానికి గురి కావడానికి తడపాకల్‌కు చెందిన ఒక బాలుడు కారణం అని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. బాల్కొండ మండల కేంద్రంలో గురువారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్ట్ చేయాలని జలంధర్ బంధువులు ఆందోళన చేయగా ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్ కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో అంత్యక్రియలను నిర్వహించారు. హోంగార్డు మృతదేహం వద్ద కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి నివాళులు అర్పించారు.

గతంలో అన్న.. ఇప్పుడు తమ్ముడు

ఏర్గట్ల మండలంలోని గుమ్మిర్యాల్ శివారులో గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జలంధర్ అన్న కామారెడ్డి జిల్లాలో హోంగార్డుగా పని చేస్తున్న సహదేవ్ మూడేళ్ల కింద మరణించాడు. ఇప్పుడు జలంధర్ రోడ్డు ప్రమాదంలో మరణించడం వారి కుటుంబాన్ని విషాదంలో ముంచెత్తింది. ఇద్దరు సోదరులు హోంగార్డులుగా పని చేస్తు తమ సొంత మండలంలోనే రోడ్డు ప్రమాదంలో మరణించడం విషాదకరం.

నివాళులు అర్పించిన డీసీపీలు

ఖలీల్‌వాడి: జలంధర్ మృతదేహానికి జీజీహెచ్‌లోని పోస్టుమార్టం గది వద్ద అదనపు డీసీపీలు జయరామ్, గిరిరాజు నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

రుద్రూర్: రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ శివారులో గురువారం రాత్రి బస్సు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. రుద్రూర్‌కు చెందిన శంకర్ బైక్‌పై వెళ్తుండగా బస్సు ఢీకొంది. క్షతగాత్రుడిని 108లో బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు



గాంధారి: గాంధారి సమీపంలో గురువారం ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైనట్లు 108 ఈఎంటీ సురేష్ తెలిపారు. పది మంది ప్రయాణికులతో గాంధారి నుంచి బూర్గుల్ వెళ్తున్న ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన నేనావత్ రమేష్, రాధ, సంతోష్, రేణాను కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో చేర్పించినట్లు ఆయన తెలిపారు.